క్లుప్తంగా

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

టేకులపల్లి: అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం లచ్చగూడెం గ్రామంలో సీపీఎం గ్రామశాఖ మహాసభ దొడ్డ సావిత్రి అధ్యక్షతన నిర్వహించగా శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిత్యం పోరాటాలు సాగించామని, ఇందులో అమరులైన భట్టు పాపయ్య, గొగ్గెల భాస్కర్, పోలెబోయిన రామయ్యతోపాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా సీపీఎం గ్రామశాఖ మహాసభలు ఘనంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. దొడ్డ సంపత్‌కుమార్, పాయం సమ్మయ్య, ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, దొడ్డ సావిత్రి, దొడ్డ కోటేశ్వరరావు, ఈసం చుక్కమ్మ, భట్టు సత్తెమ్మ, ముత్తయ్య, కోరం లక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సత్కారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ విభాగంలో సీనియర్ సివిల్ వర్క్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన రమణమూర్తి దంపతులను అభ్యుదయ కళాసేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సివిల్ జీఎం సూర్యనారాయణ, ఏజీఎం సివిల్ రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు దీక్షలో జూలూరుపాడు వాసి

జూలూరుపాడు: హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్షం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన రైతు దీక్షలో జూలూరుపాడుకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఇస్తామని చెప్పిన హామీలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

బతుకమ్మ సంబురాలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెం అర్బన్ ప్రాజెక్ట్ సెక్టార్‌లో సోమవారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్.ఉమాదేవి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని తెలిపారు. గోనేమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులందరికీ చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): అన్ని సెక్టార్ల కాంట్రాక్ట్ కార్మికులందరికీ పర్ఫామెన్స్ లింక్డ్ రివార్డ్ చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని సివిల్ విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈ నెల 29న ఢిల్లీలో జరిగిన కోలిండియా, జాతీయ కార్మిక సంఘాల మధ్య చర్చల్లో గని కార్మికులకు రూ.93,750 చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని, వారితోపాటు బొగ్గు ఉత్పత్తి కార్యకలాపాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు 8.33 శాతం బోనస్ ఇచ్చి మిగతావారికి ఇవ్వకపోవటం సరికాదన్నారు.

సీఐ రమేశ్‌కు అభినందన



సీఐ రమేశ్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్‌ను డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అభినందించారు. సోమవారం కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రెహమాన్ మాట్లాడుతూ.. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో లోక్ ఆదాలత్ కేసుల పరిష్కారంలో సీఐ బాధ్యతగా పనిచేశారని చెప్పారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కరుణాకర్, చుంచుపల్లి సీఐ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

టేకులపల్లి: బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యాశాఖ ఆదేశాలు పాటిస్తూ విద్యార్థులకు ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు పొగాకు లక్ష్మి, బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగీలాల్ కార్యక్రమాన్ని ప్రారంభించి.. విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.జ్యోతిరాణి, ఎస్జీఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసీం, లోగాని శ్రీనివాస్, నసీంపాషా, జే.పద్మ, నీరజ షారోన్, అబ్బయ్య, సరోజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



కుటీర పరిశ్రమగా నాటు కోళ్ల పెంపకం

- 116 మంది మహిళలకు యూనిట్లు కేటాయింపు
- ప్రయోగాత్మకంగా పది యూనిట్లు పంపిణీ
- మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్న సెర్ప్



కొత్తూరులో నాటుకోళ్ల పెంపకం యూనిట్ వద్ద లబ్ధిదారులు

ఇల్లెందురూరల్: మహిళలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వ్యక్తిగత రుణాలను అందిస్తూనే స్వయం ఉపాధి వనరులు మెరుగుపడేలా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా రుణాలు మంజూరు చేస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మహిళాశక్తి పథకంలో భాగంగా మహిళల ఆసక్తి మేరకు కోళ్లు, పాడి పరిశ్రమలను అధికంగా నెలకొల్పాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలివిడతగా వ్యక్తిగతంగా నాటుకోళ్ల పెంపకానికి సంబంధించిన యూనిట్లు మంజూరు చేస్తున్నారు. తద్వారా మహిళలు వ్యాపారులుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నారు.

మండలంలో పొదుపు సంఘాల వివరాలు

మండల స్థాయిలో నటరాజ మండల మహిళా సమాఖ్యను ఏర్పాటు చేశారు. మండల సమాఖ్య పరిధిలో మొత్తం 86 గ్రామ సంఘాలు ఉండగా అందులో 1,146 సంఘాలు ఏర్పాటయ్యాయి. ఆయా సంఘాల్లో మొత్తంగా 11,494 మంది సభ్యులు ఉన్నారు.

రూ.25 వేలు యూనిట్ ధరతో..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాటు కోళ్లు, గుడ్లకు మంచి డిమాండ్ ఉండటంతో ఆ దిశగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా మహిళలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళలకు మదర్, వ్యక్తిగత యూనిట్లు అందించడానికి ముందస్తుగా క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించి ఆసక్తి ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఇలా మండలంలో మొత్తం 116 నాటు కోళ్ల పెంపకం యూనిట్లను మంజూరు చేశారు. ఒక్కో సభ్యురాలికి రూ.25 వేల చొప్పున నిధులను స్త్రీనిధి ద్వారా మంజూరు చేస్తున్నారు. మొత్తంగా ఒక్కో సభ్యురాలికి వంద పిల్లలను సెర్ప్ అధికారుల పర్యవేక్షణలో కొనుగోలు చేసి లబ్ధిదారులైన మహిళలకు అందజేస్తున్నారు.

నాటుకోళ్ల పెంపకం

సాధారణంగా కోళ్లు ఆరోగ్యంగా ఎదిగేందుకు ప్రత్యేకంగా దాణా వేస్తారు. కానీ నాటుకోళ్లు ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే తృణధాన్యాలు, గడ్డి గింజలు, కీటకాలు, చెదలు, వానపాములను తింటాయి. అయితే తాజాగా మంజూరు చేసిన కోడి పిల్లలను ప్రత్యేకంగా తయారు చేసిన గూళ్లలో పెంచేలా అధికారులు జాగ్రత్తలు సూచించారు. దీని కోసం మహిళలు ఏర్పాట్లు చేసుకోవడం కొంత ఆర్థిక భారమైనా కోడి పిల్లలు ఎదిగేంతవరకు అవసరమని భావించి ప్రత్యేక గూళ్లను సొంత ఖర్చులతో సిద్ధం చేసుకుంటున్నారు. ఇంతేకాకుండా చిన్నపిల్లలకు అవసరమైన దానాను కూడా కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు కొంత పెరిగాక ఇంటి పెరడులో వాటిని పెంచేలా మహిళలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మేలు జాతి రకాల పిల్లలు

మహిళలకు తాజాగా పంపిణీ చేసిన కోడి పిల్లల్లో పలు మేలు జాతి రకాలు ఉన్నాయి. రాజశ్రీ, గ్రామప్రియ, కృషిబ్రో, రైన్‌బో రోస్టర్, వనరాజా, శ్రీనిధి గిరిరాజ, అసిల్, కడక్‌నాథ్ వంటిరకాలను ఎంపిక చేసి మహిళలకు సెర్ప్ అధికారులు పంపిణీ చేస్తున్నారు. ఆయా రకాలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి అందజేస్తున్నారు.

అందుబాటులో పశువైద్యులు

వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా కోళ్లకు పలు రకాలైన వ్యాధులు వస్తాయి. వ్యాధి సోకిన ఒకటి రెండు రోజుల్లోనే కోళ్లు మృతి చెందుతాయి. ఇలాంటి పరిస్థితిలో వ్యాధి సోకిన విషయాన్ని గుర్తించడానికి పెంపకం దారులకు కొంత అనుభవం అవసరం. దీనికోసం కోళ్లకు వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా యూనిట్లకు ఎంపిక చేసిన మహిళలకు అవగాహన కల్పించేందుకు సెర్ప్ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

యూనిట్లను సద్వినియోగం చేసుకుంటాం



గతంలో ఇళ్లలో కోళ్లు పెంచుకునేవాళ్లం. కానీ రోగాలు, కోతుల బెడద కారణంగా పెంచడం మానేశాం. ప్రస్తుతం పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నాటుకోళ్ల పెంపకం కోసం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటాం. కోళ్ల పెంపకాన్ని వృద్ధి చేసుకుంటూ వచ్చే ఆదాయాన్ని ఇంటి అవసరాలకు వాడుకుంటాం.

–మోకాళ్ల వెంకటమ్మ, కొత్తూరు, ఇల్లెందు మండలం

ఆసక్తి ఉన్న మహిళలకే యూనిట్లు



మహిళా సంఘాలు, సభ్యులకు నాటుకోళ్ల పెంపకం కోసం వ్యక్తిగత రుణాలు అందిస్తున్నాం. ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేసి యూనిట్లు గ్రౌండ్ చేస్తున్నాం. ప్రస్తుతం మండలంలో 116 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. పది మందికి 500 కోడి పిల్లలను పంపిణీ చేశాం. మిగతా వారికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తాం.

–దుర్గారావు, ఏపీఎం, ఇల్లెందు మండలం

అవినీతిపై విచారణ చేపట్టాలి..



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సీఎంపీఎఫ్ పెట్టుబడిలో జరిగిన 1000 కోట్ల అవినీతిపై సీబీఐచే విచారణ చేపట్టాలని, బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, నగదు రికవరీ చేయాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఇంటి స్థలాలు, నికర లాభాల అంశాలపై సమస్యలను ఏకరువు పెట్టారు. వీటిని పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బి.రాంసింగ్, లట్టి జగన్మోహన్, మొగిలి రవి, జీవీ కృష్ణారెడ్డి, ఊట్ల గణేశ్, శ్రీనివాసులు, వినయ్, మాదాసి రవీందర్, పవన్‌కుమార్, ప్రదీప్, మహేశ్, సతీశ్, సురేందర్, అప్పాని శ్రీనివాస్, మల్లేశ్, లీలకృష్ణ, సంఘం చందర్, నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, సారంగపాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడలు



జోన్‌స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు సోమవారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, జూలూరుపాడు మండలాల పరిధిలోని ఆశ్రమ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రెండో రోజు బాలురకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి జోన్‌స్థాయి జట్లను ఎంపిక చేశారు. అనంతరం అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించి జోన్ స్థాయి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో ఏటీడీఓ సూర్నపాక రాధ, బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం దనసరి నాగమణి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

పాల్వంచరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఊక్లా అన్నారు. మండలంలోని మల్లారం, నర్సింహసాగర్ గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయిన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో ఆదివాసీ, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పోరాటం చేయడంలో ముందుంటామని చెప్పారు. ఖనిజ సంపద దోపిడీపై తమ పార్టీ పోరాటాలు సాగిస్తుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష కట్టి బూటకపు ఎన్‌కౌంటర్లతో అనేక మంది విప్లవకారులను పొట్టన పెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఉప్పరబోయిన రాంమూర్తి, కందకట్ల సురేందర్, మలుగూరి సుగుణ, వీరమల్ల ఉమ పాల్గొన్నారు.

రోగులను ఆప్యాయంగా పలకరించండి..



జేకే డిస్పెన్సరీ తనిఖీ చేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: డిస్పెన్సరీకి వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారిని ఆప్యాయంగా పలకరిస్తూ మెరుగైన వైద్యం అందించాలని జీఎం జాన్‌ఆనంద్ సూచించారు. సోమవారం ఇల్లెందు జేకే డిస్పెన్సరీని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడ రోగులకు అందుతున్న వైద్యం, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోగి శరీర ఉష్ణోగ్రత, బీపీ చెక్ చేయాలని చెప్పారు. జీఎం వెంట డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ఏఎస్‌ఐకి అభినందన



ఏఎస్‌ఐని అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: జూలురుపాడు ఏఎస్‌ఐ బి.తిరుపతిరావు వర్టికల్ విభాగంలో ప్రతిభ కనబర్చగా ఇటీవల డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఆయన్ను ఎస్పీ రోహిత్‌రాజు సోమవారం అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్టికల్ విభాగంలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణాప్రతాప్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన పీడీఎస్‌యూ నాయకులు

ఇల్లెందు: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ 50 వసంతాల సభ కోసం ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాల నుంచి పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పృథ్వీ తరలివెళ్లిన వారిలో బి.సాయి, శివ ప్రశాంత్, వంశీవర్ధన్, పార్థసారథి, గంగాధర్, గణేశ్, ప్రణీత్, రాజ్, అబ్దుల్, ఘని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్లు కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని, ఒక క్వింటాకు రూ.300 కమీషన్ పెంచాలనే తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి ఎ.సంజీవరాజు, కోశాధికారి పి.నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్మి మృతి తీరనిలోటు

ఇల్లెందురూరల్: మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించిన పూనెం లక్ష్మి మృతి విప్లవోద్యమానికి తీరని లోటని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. మండలంలోని మాణిక్యారం గ్రామంలో సోమవారం పూనెం లక్ష్మి సంతాప సభ నిర్వహించగా మధు మాట్లాడారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనలు



ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ బాధ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో నిరుపేద ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు తక్షణమే పంపిణీ చేయాలని పలువురు.. తిరుపతి లడ్డూను కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) బాధ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. కుట్టు మిషన్ల అంశంపై ×సేవ్ కొత్తగూడెం – సేవ్ మున్సిపాలిటీ×కన్వీనర్ జలాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిరుపేదలుగా గుర్తించి ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేసిందని, మారిన ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు పంపిణీ చేయలేదని, వెంటనే పంపిణీ చేయాలని కోరారు. వీహెచ్‌పీ బాధ్యులు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖను రద్దు చేసి, దేవాలయాలను ధార్మిక బోర్డుకు అప్పగించాలని, దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహమూద్, రిజ్వానా, నసీమా, జిలానీ, వేణు, మహేశ్, పర్వీన్, అప్సర్, ఓరుగంటి సురేశ్, గడిదేశి వెంకటేశ్వర్లు, రాములోనియా, చిలుకూరి నాగేశ్వరరావు, రామాయణంశర్మ, దారా రమేశ్, గంగాధరి సీత, భూక్యా రమేశ్, చిట్టింశెట్టి లక్ష్మయ్య, విజమూరి మురళీకృష్ణ, చింటేశ్వర్, కొమ్ము నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదు..



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని, ఎలాంటి లోపాలున్నా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలో రూ.67 లక్షల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. డీఎంఎఫ్, ఎస్డీఎఫ్, ఈజీఎస్ తదితర పథకాల కింద విడుదలైన నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయని, మిగిలి ఉన్న రోడ్లు, డ్రెయినేజీలకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళి, ప్రసాద్, అశోక్‌కుమార్, సత్యనారాయణ, నాగేందర్, మతిన్, చీకటి కార్తీక్, మాధవరావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, ప్రసాద్, రామకృష్ణ, రవి, బాబు, కృష్ణ పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఎర్ర జెండానే అండ

పాల్వంచరూరల్: కార్మికులకు, కర్షకులకు, పేద వర్గాల ప్రజలకు ఎర్ర జెండా అండగా నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని ఉల్వనూరు ఎస్సీ కాలనీ, లక్ష్మీదేవిపల్లి జీపీ నర్సింహసాగర్ గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయిన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, విసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, సుధాకర్, ఇట్టి వెంకట్రావు, కొంగర అప్పారావు, శ్రీను, వైఎస్.గిరి, లాల్‌పాషా, సత్యనారాయణ, ఖాసీం, వీరస్వామి పాల్గొన్నారు.

నిధుల వ్యయంపై కౌన్సిల్‌లో చర్చ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర పండుగ బతుకమ్మ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వార్డు–3, పాత కొత్తగూడెం గోధుమవాగు ఘాట్ వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లు చేసేందుకు రూ.5.94 లక్షలు మున్సిపల్ సాధారణ, 15వ ఫైనాన్స్ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు చర్చించారు. 36 వార్డుల్లో బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేసేందుకు రూ.8.91 లక్షలు, దీపావళి సందర్భంగా మున్సిపాలిటి పరిధిలోని శ్మశాన వాటికలను శుభ్రం చేసేందుకు రూ.199 లక్షలను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, వార్డు కౌన్సిలర్లు, డీఈ రవికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

టేకులపల్లి: హైదరాబాద్ ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) సమీపంలోని గౌరెల్లి వయా వలిగొండ నుంచి మహబూబాబాద్, ఇల్లెందు, టేకులపల్లి మీదుగా కొత్తగూడెం (ఇల్లెందు క్రాస్‌రోడ్ వరకు) నిర్మించ తలపెట్టిన నేషనల్ హైవే 930–పీకి సంబంధించి టేకులపల్లి సెంటర్ నిర్వాసితులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. తమ గోడు చెప్పుకుని వినతిపత్రం అందజేశారు. హైవే నిర్మాణంలో భాగంగా టేకులపల్లి సెంటర్ నుంచి బోడు, కేటీసీకి వెళ్లే మార్గంలో జంక్షన్ కారణంగా 11 మంది నివాసాలు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్నామని, డిజైన్‌లో మార్పులు చేసి రెండు వైపులా సమానంగా భూమి సేకరించేలా చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో గుడిపూడి కృష్ణార్జున్‌రావు, రాజేశ్వర్‌రావు, మోహన్, వెంకటేశ్వర్లు, కోరం సురేందర్, రెడ్యానాయక్, భద్రు, సంజయ్, పోషాలు, మధురెడ్డి, ధర్మయ్య, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సొసైటీ కృషి..



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: రైతుల సంక్షేమానికి సొసైటీ పాలకవర్గం కృషి చేస్తుందని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ సొసైటీ జనరల్ బాడీ సమావేశం సోమవారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ.. రైతులకు రుణాల పంపిణీ, ఎంఆర్‌పీకి ఎరువుల విక్రయం, సబ్సిడీపై విత్తనాల పంపిణీ, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు వంటి కార్యాక్రమాలు చేపట్టి రైతులకు అందుబాటులో ఉంటున్నామన్నారు. సమావేశంలో కాంపెల్లి కనకేశ్, శంభో శంకర్, సురేశ్, బుడగం రామ్మోహన్‌రావు, కనగాల నారాయణ, చౌగాని పాపారావు, జనార్దన్‌రెడ్డి, సీతారాంబాబు, వెంకటేశ్వరరావు, కిషన్, వెంకట రమణ, లక్ష్మీనారాయణ, సురేందర్‌రెడ్డి, లక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు అభినందన

సింగరేణి(కొత్తగూడెం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 114వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆదివారం మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగి మొక్కల రాజశేఖర్‌ను అభినందించారు. 1556 రోజులుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. కాగా, సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు రాజశేఖర్ కృషి అభినందనీయమన్నారు.

ఏఈఓలపై పనిభారం తగ్గించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈఓ)లపై పనిభారం తగ్గించాలని సోమవారం జరిగిన జిల్లా జేఏసీ సమావేశంలో ఏఈఓలు ఏకగ్రీవంగా తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే తాము చేయమని చెప్పడం లేదని, కానీ పనిభారం కారణంగా అదనపు సిబ్బందిని ఇతర రాష్ట్రాల మాదిరిగా నియమించాలని కోరుతున్నట్లు సమావేశంలో తీర్మానించారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఇతర రాష్ట్రాలలో మాదిరిగా గ్రామస్థాయిలో ఒక పర్మనెంట్ లేదా తాత్కాలిక ప్రాతిపదికన సర్వేయర్‌ను నియమించాలని నాయకులు కోరారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి బాబూరావుకు వినతిపత్రం అందించారు. లక్ష్మణ్‌రావు, నరసింహారావు, సాహిత్య, సందీప్, రమేశ్, విజయ్, శ్రీనివాసరావు, అనూష, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.